బస్ స్టేషన్ చెంతన ఆటోల రాజ్యం

- మద్దిలపాలెంలో అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపేస్తున్న డ్రైవర్లు
- తరచూ ట్రాఫిక్ సమస్యలతో ప్రయాణికుల సతమతం



బస్సు ముందు ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్న డ్రైవర్లు



మద్దిలపాలెం బస్ స్టేషన్ ముందు రోడ్డుపై అడ్డంగా ఉన్న ఆటోలు

మద్దిలపాలెం: నిత్యం ఆటోల వలయంలో మద్దిలపాలెం బస్ స్టేషన్ సతమతమవుతోంది. మద్దిలపాలెం ఆర్టీసీ బస్ స్టేషన్ ఎదురుగా ఇష్టానుసారంగా ఆటోలను నిలిపివేస్తూ ప్రయాణికులు ఎక్కించుకుపోతున్నారు. దీంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లపై అడ్డదిడ్డంగా ఆటోలను ఆపి సర్వీసులు చేసుకుంటున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఆటోవాలాలు వాగ్వాదానికి దిగుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. స్టేషన్ నుంచి బస్సులు బయటకు వచ్చే మార్గంలో ఆటోలను నిలిపివేయడంతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వాటి దాటును వాహన చోదకులు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

ఆటోలను బస్ స్టేషన్ చుట్టూ నిలిపి సర్వీసులు చేయడంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది. బస్ స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. ఇదే ప్రాంతంలో శ్రీకాకుళం, విజయనగరం బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులను టాటా ఏస్ డ్రైవర్లు పిలిచి మరీ ఎక్కించుకుని సర్వీసు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

శ్రావణ మాసం ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారు జామున వరలక్ష్మి అమ్మవారికి ఇంట్లో పూజలు చేసిన అనంతరం దగ్గరలో ఉన్న ఆలయాలకు వెళ్లి అర్చనలు జరిపారు. హెచ్‌బీ కాలనీ కనకదుర్గ ఆలయం, గాయత్రి ఆలయం, కొత్త వెంకోజీపాలెం రాజరాజేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలు చేశారు.

బాల్య వివాహాల నివారణపై దృష్టి సారించాలి

ఎంవీపీకాలనీ: బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలలో పెద్ద ఎత్తున వివాహ ముహూర్తాలు ఉన్నందున బాల్య వివాహాలు జరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ విషయంలో నకిలీ ఆధార్ కార్డులు, ధ్రువ పత్రాలు సమర్పించే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళం



సీపీఎం నాయకులకు విరాళం అందిస్తున్న తోపుడు బళ్ల యూనియన్ నాయకులు

మద్దిలపాలెం: కేరళలో వయనాడ్ వరద బాధితులకు తోపుడు బళ్ల యూనియన్ నాయకులు గురువారం రూ.2350 విరాళం అందించారు. ఈ విరాళం మొత్తాన్ని సీపీఎం నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారిలకు యూనియన్ ప్రతినిధి వెంకటరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోలా శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



ఎన్నిక పత్రం స్వీకరిస్తున్న నూతన కమిటీ సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులుగా ఎన్నికైన వారిని శుక్రవారం అభినందించారు. 16వ వార్డు ఇసుకతోట అంబేడ్కర్ నగర్ జీవీఎంసీ స్కూల్, పాత వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్‌లో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో వారు ముఖాముఖీ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఇసుకతోట జీవీఎంసీ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.మాధవి, వైస్ చైర్‌పర్సన్ ఆర్.వెంకటలక్ష్మి, సభ్యులు, పాత వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ పడాల స్వాతి, వైస్ చైర్మన్ వై.రాము, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతుల కల్పనతోనే సమర్థంగా విధుల నిర్వహణ



సిబ్బందికి నూతన కిట్ బాక్సులను అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి
- పోలీస్ సిబ్బందికి నూతన కిట్ బాక్సుల అందజేత

విశాఖ సిటీ: పోలీస్ సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పిస్తే సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో సిబ్బందికి నూతన కిట్‌బాక్సులు అందజేశారు. అలాగే సిబ్బంది కోసం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రాంగణం సందర్శించిన ఆయన దృష్టికి సిబ్బంది పలు సమస్యలు తీసుకెళ్లారు. వారి వినతుల మేరకు మొదటి ప్రాధాన్యతగా కొత్త కిట్ బాక్సులు అందజేత, మరుగుదొడ్లు పునర్నిర్మించి ప్రారంభించడం, కొత్త హ్యాండ్ కఫ్స్ మంజూరు చేసి సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ సిబ్బందికి ఎక్కడ పని ఉంది? ఏమేం కావాలో తెలియజేస్తే ఆ ప్రకారం ఆయా పనులు చేయడానికి అవకాశం ఉంటుందని సూచించారు. తన నంబర్ 79950 95799కు తెలియజేసిన కిట్ బాక్స్, మరుగుదొడ్లు, హ్యాండ్ కఫ్స్, వెహికల్ పార్కింగ్‌కు షెడ్లు, విశ్రాంతి కోసం మెన్ వెయిటింగ్ హాల్, ఇలా అన్ని సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే ముద్దాయిల ఎస్కార్ట్ విధులకు తగ్గించాలన్న సిబ్బంది విజ్ఞప్తిపై కూడా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కచ్చితంగా అవసరమైతే తప్పా మిగిలిన అన్ని సార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముద్దాయిలను ప్రొడ్యూస్ చేసే విధానం పరిశీలించాలని అభ్యర్థన లేఖను ఉన్నతాధికారులకు పంపించినట్లు వెల్లడించారు. తమ సంక్షేమానికి పెద్దపీట వేయడంపై సిబ్బంది సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

అణ్వస్త్ర రహిత సమాజం అందరి బాధ్యత



అణ్వస్త్ర విధ్వంసంతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: అణ్వస్త్రాల రహిత సమాజం, ప్రపంచ శాంతి స్థాపన ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం చైర్మన్ నరవ ప్రకాశరావు కోరారు. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అనుబాంబు దాడులను పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అనేక దేశాలు తయారు చేస్తున్న అణ్వస్త్రాలు ప్రపంచ మనుగడకు పెనుసవాళ్లుగా మారుతున్నాయన్నారు. జపాన్‌పై జరిగిన బాంబు దాడులే దీనికి నిదర్శనమన్నారు. ఈ నేపథ్యంలో అణుబాంబుల తయారీని నిలిపివేయాల్సిన అవసరముందన్నారు. అణ్వస్త్ర రహిత సమాజంతోనే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా అణ్వస్త్ర విధ్వంసంతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు, పలువురు కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల పెన్నిధి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 115 జయంత్యుత్సవాలకు(ఆగస్టు 16) సంబంధించిన పోస్టర్‌ను ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూలో లచ్చన్న పేరు మీద ఉన్న ఎండోమెంట్ లెక్చర్‌ని కూడా నెలాఖరులోగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, ఏయూ టీఎన్‌టీయూసీ సలహాదారులు ఆవాల రమేష్, డాక్టర్ మండే సురేష్, శ్రీను, అజయ్ శ్రీనివాస్, రాజేష్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సంఘం.. శరణం.. గచ్ఛామి'

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ప్రదర్శించిన సంఘం.. శరణం.. గచ్ఛామి నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సమాజంలోని ఆనాటి సామాజిక అసమానతలను కళ్లకు కట్టినట్టు కళాకారులు ప్రదర్శించారు. ఏయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కిశోర్‌బాబు, ప్రిన్సిపాళ్లు ఆచార్య నరసింహారావు, ఆచార్య ఎంవీఆర్ రాజు, ఆచార్య షారోనురాజు, ఆచార్య ఎస్.విజయమోహన్, ఆచార్య జాలాదిరవి, ఆచార్య జర్రా అప్పారావు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని నాటక ప్రదర్శనను తిలకించారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి అనగాని

విశాఖ సిటీ: జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంటూ జిల్లా కలెక్టర్ అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించింది.

సౌకర్యాలు మెరుగుపర్చాలి

విశాఖ సిటీ: పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని, పాడైన వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న ఐఎన్ఎస్ కురుసుర సబ్ మెరైన్, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియాన్ని సందర్శించారు. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం పరిసరాలను పరిశీలించారు. ఈ పర్యటనలో వీఎంఆర్‌డీఏ సీఈ భవానీశంకర్, ఈఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

31న కౌన్సెలింగ్

మధురవాడ : బక్కన్నపాలెంలో గల ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో 2024 – 25 విద్యా సంవత్సరానికి ఐటీఐ ట్రేడుల్లో పురుష దివ్యాంగ యువతను చేర్చుకునేందుకు మూడో దశ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 31న హాజరు కావాలని పీవో జె.మాధవి తెలిపారు. శిక్షణ కేంద్రంలో కార్పెంటర్ – 18, షీట్ మెటల్ వర్కర్ – 5, పెయింటర్ – 15 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

ఆళ్వార్‌దాస్ స్కూల్‌లో క్విజ్ పోటీలు

ఎంవీపీకాలనీ: స్థానిక సెక్టార్–10లోని ఆళ్వార్‌దాస్ స్కూల్‌లో ఇంటెక్ హెరిటేజ్ క్విజ్ 2024 పోటీలు శుక్రవారం ద విశాఖపట్నం చాప్టర్ ఆఫ్ ఇంటెక్ ఆధ్వర్యంలో జరిగాయి. 21 పాఠశాలల నుంచి 190 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో నేవీ చిల్డ్రన్ స్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా.. గ్రీన్‌డేల్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను ఆయా సంస్థల ప్రతినిధులు అభినందించారు.

ఉత్సాహంగా విద్యార్థుల వీడ్కోలు వేడుక



వేదికపై ఆడిపాడుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో సీనియర్ విద్యార్థులు వీడ్కోలు వేడుక శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. సాంస్కృతిక నృత్యాలు, ఆట పాటలతో అదరగొట్టారు. కళాశాల విద్యను ముగించుకొని వెళ్తున్న పలువురు విద్యార్థులు భావోద్వేగాలకు గురయ్యారు. ఈ వేడుకల్లో కళాశాల కరస్పాండెంట్ విజయరవీంద్ర, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు కుంకుమార్చన

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో శ్రీవేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన పూజా కార్యక్రమాల్లో భాగంగా సామూహిక కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్ల అద్దాలు పగలగొట్టిన వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ: నక్కవానిపాలెం సమీపంలో పలు కార్లు అద్దాలు పగలగొట్టిన పల్లా భాస్కరరావు అనే వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. క్రాంతినగర్‌కు చెందిన పల్లా భాస్కరరావు మద్యం మత్తులో ఈ నెల 8వ తేదీ తెల్లవారు జామున ఏడు కార్ల వెనుక అద్దాలను పగలగొట్టాడు. తొలుత నక్కవానిపాలెంకు చెందిన కర్రి గణపతి అనే వ్యక్తి తెల్లవారు జామున ఆనందపురం మార్కెట్‌కు తన కారులో వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న భాస్కరరావు అడ్డుకున్నాడు. దీంతో అతను కారులో నుంచి కిందకి దిగి ఎందుకు అడ్డుకున్నావని ప్రశ్నించగా గొడవకు దిగాడు. ఈ క్రమంలో మద్యం పూటుగా సేవించి ఉన్న అతని నానో కారుతో పాటు సమీపంలో ఉన్న మరో ఆరు కార్లు వెనుక అద్దాలను రాళ్లతో పగలగొట్టారు. ఈ నేపథ్యంలో కర్రి గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో విజేతలు

బీచ్ రోడ్డు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎంసీఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలను తెలుగు, ఇంగ్లిష్‌లో నిర్వహించారు. పోటీలకు శేయల్ జాక్సన్ కన్వీనర్‌గా వ్యవహరించగా.. ప్రెసిడెంట్‌గా క్రూపదస్ కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టీవెన్ పీటర్, మణి కుమార్, ఇమ్మానియల్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల వసతిగృహం తనిఖీ



వసతిగృహ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–10లోని గిరిజన బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించడంతో పాటు మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బియ్యం స్టాక్ పాయింట్‌ను, ఇతర ఆహార సామగ్రిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్.. ఆహారం, వసతుల విషయంలో విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. మెనూ కచ్చితంగా పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, వసతి గృహ వార్డెన్ పాల్గొన్నారు.

హాకర్ జోన్ తొలగించి మా పొట్టలు కొట్టొద్దు

మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చిరు వ్యాపారుల ధర్నా



మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

మద్దిలపాలెం: హాకర్ జోన్ తొలగించి మా పొట్టలు కొట్టొద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కాంప్లెక్స్ వద్ద చిరు వ్యాపారులు ధర్నా చేశారు. మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రహరీకి ఆనుకుని జీవీఎంసీ హాకర్ జోన్ ఏర్పాటు చేశారు. అయితే దీన్ని తొలగించి ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయడానికి పూనుకోవడంతో చిరు వ్యాపారులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు వెంకటరావు మాట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం హాకర్ జోన్ తొలగించాలని సూచనలు చేస్తున్నారన్నారు. ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయనున్నామని చెబుతున్నారని, దీంతో 25 మంది చిరువ్యాపారులు ఉపాధి కోల్పోతారని ఆయన పేర్కొన్నారు. వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు నీటి నిల్వలు తొలగించండి



లక్ష్మీనగర్‌లో నీటి నిల్వలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



చైతన్యనగర్ కాలనీలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

మద్దిలపాలెం: ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించుకోవాలని జిల్లా మలేరియా విభాగం ఆరోగ్య కార్యకర్తలు కె.వేణుగోపాలు, శ్రీను సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం శివాజీపాలెం పరిధిలో లక్ష్మీనగర్ కాలనీ, చైతన్యనగర్ కాలనీ పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిల్వ నీటిని తొలగించాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా విభాగం, సిబ్బంది, యాంటీ లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయం



సమైక్య నినాదం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

ఎంవీపీ కాలనీ: గిరిజన హక్కులను పరిరక్షించుకోవడమే ఆదివాసీ సంఘాల లక్ష్యం కావాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంబిడి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలను శుక్రవారం ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో ప్రారంభించారు. తొలుత వారోత్సవాల జెండాను గిరిజన సంఘాల నాయకులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయపరంగా గిరిజనులు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. గిరిజనుల కోసం రాజ్యాంగంలో రూపొందించిన చట్టాల అమలులో నేటికీ వివక్ష కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ, పలు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం



ఆక్రమణకు గురైన స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు వద్ద రెవెన్యూ అధికారులు



రెవెన్యూ, పశు సంవర్థక శాఖ అధికారులతో వాగ్వాదం చేస్తున్న తోటగరువు వాసులు

ఆరిలోవ: తోటగరువు వద్ద ఎర్నిదుర్గమాంబ ఆలయం పక్కన పశు సంవర్థక శాఖకు చెందిన కొంత స్థలం ఆక్రమణకు గురైంది. దీనిపై పలువురు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పశు సంవర్థక శాఖ అధికారులు ఇటీవల పరిశీలించారు. ఎంత స్థలం ఆక్రమణకు గురైందో సర్వే నిర్వహించాలని రూరల్ తహసీల్దారును కోరారు. దీంతో సర్వే చేపట్టిన రూరల్ రెవెన్యూ అధికారులు ఇక్కడ 72 సర్వేనంబరులో సుమారు 10 సెంట్లు పశు సంవర్థక శాఖకు చెందిన స్థలం కబ్జాకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం రూరల్ రెవెన్యూ కార్యాలయం ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది, పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సతీష్, సిబ్బందితో వెళ్లి ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తోటగరువుకు చెందిన కొందరు పెద్దలు అక్కడికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. అక్కడ స్వయంభూ శివ లింగం ఏర్పడిందని, అక్కడ శివాలయం నిర్మిస్తామని అధికారులను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినా అధికారులు వారిపని వారు చేసు కుపోయారు. ఈ స్థలాన్ని మళ్లీ వరైనా ఆక్రమిస్తే పోలీసు కేసు పెడతామని హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 91 మంది ఎంపిక

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెన్‌పెక్ట్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాలో 91 మంది ఎంపికయ్యారు. వివిధ కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి విజయబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్‌లో పని చేయడానికి నియామక పత్రాలు త్వరలో అందిస్తారన్నారు. జాబ్ మేళా నిర్వహించిన జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావును, మ్యాజిక్ బస్సు కో ఆర్డినేటర్ రాజును ఆయన అభినందించారు.